

ప్రతి మనిషికి ప్రత్యేకమైన ముఖాకృతి ఉంటుంది. కళ్లు, ముక్కు, చెవి, పెదాలు, బుగ్గలు, చుబుకం
.. రూపురేఖల్ని, ఆయా భాగాల మధ్య దూరాన్ని త్రీ డైమెన్షన్‌లో నకలు తీసి.. భద్రపరచడమే ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ప్రత్యేకత. ఆ సమాచారాన్నంతా ఓ చోట జమ చేస్తారు. అందులోని డేటాబేస్ ఆధారంగా..

ఓ వ్యక్తిని గుర్తించడం.

వయసును అంచనా వేయడం.

ఇతర మాధ్యమాల్లోని సమాచారంతో బేరీజు వేసి వృత్తి, వ్యాపకాల్ని విశ్లేషించడం.

సమాచార కేంద్రానికి అనుసంధానించిన సీసీ కెమెరాలలో కనిపిస్తే తక్షణం నిఘా వ్యవస్థను అప్రమత్తం చేయడం... ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చాక చిటికెలో పని. కరోనా రోజుల్లో ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ప్రాధాన్యం మరింత తెలిసి వచ్చింది.

ఆ టెక్నాలజీతో..

ఫోన్ అన్‌లాక్ చేసుకోవచ్చు.

ఆఫీసులో అటెండెన్స్ ఇచ్చుకోవచ్చు.

సీక్రెట్ లాకర్ తలుపులు తెరుచుకోవచ్చు.

ఇంటి ద్వారాలూ స్వాగతం పలకవచ్చు.

ఇంతే. ఇదే తెలుసు మనకు.

కానీ, ఇంతకుమించి ఎంతో జరుగుతున్నది.

మన ముఖాకృతుల నమూనాలతో ఏకంగా ఓ వర్చువల్ ప్రపంచాన్నే సృష్టిస్తున్నారు. సప్త సముద్రాలకు అవతల, ఒంటిస్తంభం మేడమీద, చిట్టచివరి అంతస్తులో.. బంగారు పంజరంలోని చిలకలో మాంత్రికుడి ప్రాణాలు ఉన్నట్టు.. మనకు సంబంధించిన సమస్త సమాచారమూ ఆ ఫొటోతో ముడిపడి ఉంటుంది. ఆ ఒక్క ఆధారం చాలు. మీరెవరో తెలుసుకోవచ్చు. మీ భావజాలాన్ని అర్థం చేసుకోవచ్చు. మీ ఆర్థిక చరిత్ర చెప్పేయవచ్చు. మీ వృత్తి, ఉద్యోగాలు ఏమిటన్నది తేల్చేయవచ్చు. అవును. ఏదైనా సాధ్యమే?

ఈ క్షణంలో మీరు.. పంజాగుట్ట చౌరస్తాలో ఉన్నారా? ఇప్పుడే, అమీర్‌పేట సిగ్నల్ దాటుకుని ఎర్రగడ్డ వైపు వెళ్లారా? అట్నుంచి సుందరనగర్ కాలనీ దిశగా మళ్లారా? ఆ మారుమూల గల్లీలో ఎవరి ఇంటి కాలింగ్ బెల్ నొక్కారు? అక్కడ ఎంతసేపు ఉన్నారు? మళ్లీ బైక్ మీద భరత్‌నగర్ కాలనీకి ఎప్పుడు బయల్దేరారు?.. ఒకటేమిటి, సమస్త సమాచారం తెలియాల్సిన వాళ్లకు తెలిసిపోతుంది. ప్రతి సీసీ కెమెరానూ ఆధునిక సాంకేతికతకు అనుసంధానించడం వల్లే ఇదంతా సాధ్యమైంది.

## సెలెబ్రిటీలకు సమస్యే!



సెలెబ్రిటీల ముఖాలు అత్యంత విలువైనవి. వాటికి బ్రాండ్ వ్యాల్యూ ఉంటుంది. మార్కెట్ ధర కూడా ఉంటుంది. కాబట్టే హాలీవుడ్ స్టార్స్ ఫేస్ ఇన్సూరెన్స్ చేయించుకుంటారు. మొహంలో తేడా వస్తే అవకాశాలు తగ్గిపోతాయి. ఆ కష్టాన్ని బీమాతో పూడ్చుకోగలమనే ధీమా. కానీ, సాంకేతికత ఆ ముఖారవిందాలను వర్చువల్‌గా కబ్జా చేస్తున్నది. ఆ ఇబ్బందిని చట్టపరంగా అధిగమించడానికి అనిల్ కపూల్ లాంటి నటులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. తన అనుమతి లేకుండాఎవరూ తన ముఖాన్ని ఏ రూపంలోనూ వాడుకోడానికి వీలులేకుండా ఆదేశాలు జారీ చేయమని కోరాడు అనిల్. 'నేను ఉన్నప్పుడే కాదు, పోయిన తర్వాత కూడా నా ముఖాన్ని దుర్వినియోగం చేయడానికి వీల్లేదు' అంటాడు అనిల్ కపూర్. రజనీకాంత్, షారుక్‌ఖాన్, ఆమిర్‌ఖాన్ తదితరుల ముఖాలు ఆన్‌లైన్‌లో తీవ్రంగా దుర్వినియోగం అవుతున్నాయి. తెలుగు సినిమాకు వస్తే.. హాస్యనటుడు బ్రహ్మానందం ఫొటోలను కూడా రకరకాలుగా వాడుకుంటున్నారు. ఇదంతా ముఖాన్ని చిన్న బుచ్చడమే, వ్యక్తిత్వాన్ని భంగపరచడమే.







### మంచి-చెడు

నాణానికి బొమ్మ, బొరుసు ఉన్నట్టు.. ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీలోనూ మంచిచెడులు ఉన్నాయి. కాబట్టే, అమెరికా లాంటి దేశాలు శత్రుదేశపు గూఢచారుల వివరాలను ఇట్టే పట్టేస్తున్నాయి. కరడుగట్టిన నేరస్థులను అరెస్టు చేయడం చిటికెలో పని. ఫలానా ప్రాంతంలో కనిపించగానే.. సీసీ కెమెరా గుర్తుపట్టేస్తుంది. క్షణాల్లో కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వెళ్లిపోతుంది. పదంటే పది నిమిషాల్లో అష్ట దిగ్బంధనం చేసేస్తారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ యాప్.. క్లియర్ వ్యూ కీలకపాత్ర పోషిస్తున్నది. దీనికి కృత్రిమ మేధను జతచేశారు. మృతదేహాల్ని గుర్తించడంలో, శత్రుదేశ సైనికుల్ని కనిపెట్టడంలో ఈ సాంకేతికత ఎంతో ఉపకరిస్తున్నది. ఒక్క క్లిక్ చాలు. ఇంటర్నెట్ ప్రపంచంలోని వేల లక్షల ఫొటోలతో సరిపోల్చి.. నిజాన్ని నిగ్గు దేలుస్తుంది. ఆ వ్యక్తి ఎవరన్నది కనిపెడుతుంది. దీనివల్ల చాలా సమస్యలు తప్పిపోతాయి. నేరగాళ్లకు అయితే ఇదో సింహ స్వప్నమే. ఈ మధ్య అమెరికాలో ఓ చిన్నారి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందింది. ఎవరో అత్యాచారం చేసి చంపేసినట్టు నిర్ధారణ అయ్యింది. దగ్గర్లోని నిఘా కెమెరాలో ఓ అనుమానాస్పద వ్యక్తిని గుర్తించారు. అతను ఎవరన్నది తేల్చడానికి ముఖ గుర్తింపు టెక్నాలజీ సాయం తీసుకున్నారు. ఆ పరికరం ఫేస్‌బుక్‌ను జల్లెడపట్టి, ఓ గ్రూప్ ఫొటోను వెలికితీసి ఇచ్చింది. అందులో ఓ జిమ్‌లో చిట్టచివరన నక్కినక్కి నిలుచున్న వ్యక్తే నేరస్తుడు. జిమ్‌కు ఫోన్ చేసి.. అతను ఎవరన్నది కనిపెట్టారు. గంట సేపట్లో అరెస్టు జరిగిపోయింది. ఇదంతా ఎంతోకొంత మంచే. మరి చెడు? హంగేరీ లాంటి చోట్ల పాలకవర్గం ఈ సాంకేతికత సాయంతో.. ప్రత్యర్థి వర్గాలను వేటాడి వేటాడి పట్టుకుంటున్నది. ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు తదితర ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు నడిచినప్పుడు.. ఈ సాంకేతికత పాలకుల చేతిలో ఓ వజ్రాయుధమే. ప్రతి మొహాన్నీ రికార్డు చేసి, ప్రతి ఉద్యమకారుడి వివరాలూ తెలుసుకోవచ్చు. ఆ తర్వాత, కేసు పెట్టి జైలులో తోసేయవచ్చు. తిరుగులేని సాక్ష్యాలు ఉంటాయి కాబట్టి, కఠిన